05ATP22_05ATP22.qxd 22-10-2025 PM 11:15 Page 1



## చెరువులను నింపి రైతులను ఆదుకోండి

- హెచ్ఎల్సి ఈఈకి వినతిపత్రం అందజేసిన రైతులు



హెచ్ఎల్సి అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

పుట్లూరు మండలంలోని చెరువులకు నీటి నింపి ఆదుకోవాలని కోరుతూ పలువురు రైతులను బుధవారం హెచ్ఎల్సి ఈఈకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులతో పాటు యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి తాగునీటి కష్టాలతో పాటు రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, బొప్పేపల్లి చెరువులకు హెచ్ఎల్సి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు హెచ్ఎల్సి ఈఈకి విన్నవించారు.

## ఏపిటిఎఫ్ యాడికి మండల నూతన కమిటీ ఎంపిక




ఏపిటిఎఫ్ నూతన కార్యవర్గ సంఘం సభ్యులు ఎంపికైన దృశ్యం

**యాడికి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల-1లో ఏపిటిఎఫ్ నూతన మండల శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యవర్గ సభ్యుడు నాగరాజు తెలిపారు. మండల అధ్యక్షులుగా నూర్‌మొహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా రామాంజినేయులు, గౌరవాధ్యక్షులుగా జయప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. ఏపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాసయాదవ్, నబిరసూల్‌ను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, గోపీనాథ్, జయరాంరెడ్డి, కృష్ణమూర్తి, రామానుజులు, రవికుమార్, ప్రతిభారాణి, ఉమామహేశ్వరి, సారమ్మ, ఇంద్ర, భారతి, కుమారి, రామ్మోహన్, నరసింహులు, వెంకటకృష్ణ, చంద్రశేఖర్, శివలక్ష్మి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలను మరువం

- ఎస్ఐ వెంకటరమణయ్య



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**యాడికి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం యాడికి శ్రీచెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో ఎస్ఐ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరులను వారి త్యాగాలను మరిచిపోకూడదన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు, పోలీసు అమరవీరుల సంస్మరణ గురించి ఆటో డ్రైవర్లతో పాటు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గౌరీ, హెడ్ కానిస్టేబుల్ శివగౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు యాడికి విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

**యాడికి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలో బుధవారం జరిగిన డివిజన్ స్థాయి టీములు కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గుంతకల్లు డివిజన్ తరపున యాడికి విజన్ హై స్కూల్ విద్యార్థి తృషిత పాల్గొని అద్భుతంగా ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ తెలిపారు. మొదటి మ్యాచ్‌లో గుంతకల్లు డివిజన్ ధర్మవరం జట్టుపై గెలుపొంది అనంతరం ద్వితీయ మ్యాచ్‌లో పుట్టపర్తి జట్టుపై గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నట్లు, ఫైనల్‌లో పెనుగొండ జట్టుతో తలపడిన గుంతకల్లు డివిజన్ జట్టు అద్భుత పోరాట పటిమను ప్రదర్శించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుండి 29 వరకు పశ్చిమ గోదావరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అనంతపురం జిల్లా జట్టు తరపున పాల్గొనడం జరుగుతుందనీ విశ్వనాథ్ అన్నారు. తృషిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో విజన్ ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను అభినందించారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం



**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం ఓబులేసు కోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసిం స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్ష త్రం స్వాతినక్ష త్రాన్ని పురస్కరించు కుని ఉదయం అర్చకులు యోగానంద శర్మ స్వామివారికి సుప్రభాతసేవ, నవకలశ స్నపన, తిరుమంజనసేవ, తోమాలసేవ, సహస్రనామార్చానసేవ, మహా నివేదన శాత్తుమొరై, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగము, తదితర పూజా కార్య క్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## బదిలీ పొందిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలి

- ఎస్‌టియు డిమాండ్



ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌టియు సభ్యులు

**యాడికి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయుల సమస్యల సేకరణ సభ్యత్వ స్వీకరణ కార్యక్రమాన్ని ఎస్‌టియు సభ్యులు చేపట్టారు. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షల నుండి మినహాయించాలని బదిలీల్లో భాగంగా బదిలీ పొందినప్పటికీ రిలీవర్లు లేక ఇంకనూ రిలీవ్‌కాని వారిని తక్షణమే రిలీవ్ చేయాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ కేటగిరీలో అనంతపురము జిల్లా నుండి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు అంతర్ జిల్లా జిఒ ప్రకారం దరఖాస్తు చేసుకొని ఉన్నప్పటికీ వారికి ఇప్పటికే ఆయా జిల్లాల్లో అదనపు పోస్టులు ఉన్నాయనే కారణంతో వారికి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఇది జిఒకు విరుద్ధమనీ , వెంటనే వారు స్పౌజ్ కేటగిరీలో కోరుకున్న జిల్లాలకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్‌టియు జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డిఎస్‌సిలో పాఠశాలల్లో చేరిన వారికి జీతాలు ఆలస్యం కాకుండా వెంటనే పొజిషన్ ఐడిలు కేటాయించి జీతాలు మంజూరయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె. కేశవనాయుడు, మండల అధ్యక్షుడు ఆసిఫ్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన కార్తీకమాసం పూజలు


**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



బుగ్గరామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

కార్తీకమాసం పూజలు బుధవారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తాడిపత్రి పట్టణ సమీపం లోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామికి ఉదయం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్య శర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, తదితరులు భక్తుల సౌకర్యార్థం భారీకేడ్లు, చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీకమాసం పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం



వర్షం నీటిని పట్టుకుంటున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వెనుక కొన్ని ఇళ్లకు నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చేసేది ఏమిలేక ప్రస్తుతం కురుస్తున్న వర్షం నీటిని ఒడిసి పట్టుకొంటున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ఇంటిలోని ఖాళీ బిందెలు, బకెట్లతో వర్షం నీటిని పట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. నీటి సమస్యను అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇళ్లకు నీటిని సరఫరా చేయాలని ఆయా గృహాల వారు వేడుకుంటున్నారు.

## ఈపిఎఫ్ కోసం రిటైర్డ్ ఆర్టిసి ఉద్యోగి ఎదురుచూపు

**కదిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ఆర్టిసి సంస్థలో ఉద్యోగం చేస్తూ అనారోగ్య కారణాలతో పదవీ విరమణ పొందిన ఆయుబ్‌ఖాన్ ఐదేళ్ల గడుస్తున్నా ఈపిఎఫ్-1995 కోసం రిటైర్డ్ ఉద్యోగి ఎదురు చూస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలలోకి వెళ్తే.. కదిరి ఆర్టిసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కిడ్నీ వ్యాధి, పెరాలసిస్ స్ట్రోక్ వచ్చి 10-08-2021న వైద్య కారణాలతో పదవీ విరమణ చేశారు. ఇప్పటికీ ఐదు సంవత్సరాలు అవుతున్నా ఎంప్లాయిస్ ప్రావిడెడ్ ఫండ్ 1995 కాని, తమ కుమారుడుకి ప్రత్యామ్నాయ ఉద్యోగం రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మీడియా ముందు మొర పెట్టుకున్నారు. తమకు రావాల్సిన ఈపిఎఫ్, ప్రత్యామ్నాయ ఉద్యోగానికి రాష్ట్ర మంత్రి లోకేష్, జిల్లా కలెక్టర్, ఆర్టిసి మేనేజింగ్ డైరెక్టర్, పిఎఫ్ అధికారులు, మైనార్టీ కమిషన్‌లకు కూడా తమ గోడును ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదన్నారు. ప్రస్తుతం తాను అనారోగ్యంతో ఒక పక్క బాధపడుతూ మరో పక్క పెళ్లీడుకు వచ్చిన ఆడబిడ్డలకు వివాహాలు చేయలేక ఆర్థికంగా అప్పులై చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న అయూబ్

## తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

**యల్లనూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మండలంలోని కూచివారిపల్లి గ్రామానికి చెందిన వల్లపు తులసమ్మ తనపై కొంత మంది దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా వున్నాయి. తులసమ్మ ఇంటి వద్దకు తాడిపత్రి పట్టణానికి చెందిన, వల్లెపు అనూష, మల్లెల శ్రీలక్ష్మీ మరో ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకుని తులసమ్మ ఇంటి వాకిలి పగలగొట్టి ఆస్తిలో వాటా ఇవ్వకపోతే నీ కథ చూస్తామంటూ నానా దుర్భాషలాడుతూ కాళ్లు చేతులతో కొట్టి గాయపరిచారని తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

## మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఒ వివి శర్మ



మొక్కలు నాటుతున్న అధికారులు

**తనకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

తనకల్లు గ్రామ పొలం సర్వే నెంబర్ 2.793 ప్రభుత్వ భూమిలో ఆర్డీఒ వి.వి శర్మ. తహశీల్దార్‌లు బుధవారం స్కూల్ పిల్లలతో కలసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ గోపి, డిప్యూటి తహశీల్దార్ మల్లికార్జున, ఆర్ఐ అశోక్, మండల విద్యాధికారి, మండల సర్వేయర్, మండల రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సిజి ప్రాజెక్ట్‌ను సందర్శించిన ఆర్డీఒ వివి శర్మ

**తనకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



సిజి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఒ వివి శర్మ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిండిన మండలం లోని చంద్రయస్వామి ప్రాజెక్టును బుధవారం ఆర్డీఒ వివి శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు పడడంతో చెరువులు అక్కడక్కడ నిండాయని రైతులు పంటలు పెట్టుకోవడానికి బోర్లలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఆర్ఐ, సిజి ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమరం భీం జయంతి వేడుకలు



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టిసి ఉద్యోగులు

**కదిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

స్థానిక ఏపిఎస్ ఆర్టిసి డిపో ఆవరణంలో బుధవారం కొమరం భీం జయంతి వేడుకలను జై భీం ఏపి ఎస్‌టిటిడి అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆదివాసుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఘనట కొమరం భీంకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రీజనల్ నాయకులు ఆర్‌జి.నాయక్, కెవి.రమణ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జివైపురావ్, నాయకులు గంగాధర్, రవి, ఎంప్లాయిస్ యూనియన్ డిపో నాయకులు కొండారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నరసింహులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## తాటిమానుగుంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి



ఎంపిడిఓ పార్థసారధితో మాట్లాడుతున్న తాటిమానుగుంత గ్రామస్తులు

**నంబులపూలకుంట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ఎన్‌పి కుంట మండలం వెలిచెలమల గ్రామ సచివాలయ పరిధిలోని తాటిమానుగుంత గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఉందని ప్రభుత్వనికి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి యాదల్ల రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు బైఠాయించారు. అదేవిధంగా వెలిచెలమల నుండి తాటిమానుగుంత గ్రామం వరకు రోడ్డుకి ఇరువైపుల చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే స్పందించి తాగునీటి సమస్య, రోడ్డు సమస్యను పరిష్కరించాలని పార్థసారధి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, నాగరాజు వెంకటయ్య, లక్ష్మయ్య, చిన్న నరసయ్య ఎర్రయ్య, శివయ్య, వేమయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలి

- తహశీల్దారు దేవేందర్ నాయక్

**నంబులపూలకుంట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**


ప్రస్తుతం వర్షాలు భారీ వర్షాలుగా మారే అవకాశం ఉందని కావున మండలంలోని ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు దేవేంద్ర నాయక్ ప్రజలకు తెలియజేశారు. గురువారం మండల పరిధి పెడబల్లి ప్రాజెక్టు రెవిన్యూ అధికారి రెవెన్యూ సిబ్బంది సందర్శించి పరిశీలించి ఆ పరిశాల ప్రాంతంలో ఉండే గ్రామ ప్రజలతో తహశీల్దారు దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పై ప్రాంతాల నుండి నీటి ప్రవాహం ఎక్కువగా వచ్చినట్లయితే ఆ పరిసరాల ప్రాంతంలో ప్రజలు, పిల్లలు, వృద్దులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే పెడబల్లి ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా విద్యుత్ తీగలు విద్యుత్ స్తంభాలు ప్రమాద స్థితిలో ఉన్న అలాగే పాడుబడిన బిల్డింగులు ఉన్న అప్రమత్తంగా ఉండివెంటనే సంబంధిత అధికారులకి తెలియచేయాలన్నారు. అలాగే ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులు/గ్రామ రెవెన్యూ అధికారి/ తహశీల్దారుకి తెలియచేయాలని కోరారు.



తహశీల్దారు దేవేందర్ నాయక్

## అప్రమత్తంగా ఉండాలి ఎక్కడ కూడా ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా తగిన జాగ్రత్త వహించండి

- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**పుట్టపర్తి, అక్టోబరు 22: ప్రభాతవార్త**

బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో రాయలసీమలో ముఖ్యంగా సత్య సాయి జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నట్లు ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిందని, ఇందుకు సంబంధించి అధికారులందరూ 24/7 ప్రకారం అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్లపై రెవిన్యూ మరియు ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్పపీడన ద్రోణి ప్రభావంతో అధికంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాలలో తగిన ప్రణాళికలతో ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేసుకోవాలన్నారు. వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, పశు, ఆస్తి నష్టాలు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ కింద, పాడైపోయిన పాత భవనాలలో, పాడుబడిన పాఠశాలలలో ఉండరాదన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతలపై దృష్టి పెట్టి అక్కడ ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. ప్రజలు పొంగిపొర్లె వాగులు, రోడ్లు దాటే ప్రయత్నం చేయకుండా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి రైతులు అనుబంధ శాఖల అధికారుల సూచనలు, ముందస్తు హెచ్చరికలను పాటిస్తూ ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా జిల్లా యంత్రాంగంతో సహకరించే విధంగా గ్రూపులలో మెసేజ్ పంపాలన్నారు. ఇరిగేషన్ అధికారులు సదాప్రమత్తంగా ఉండాలని... ఎక్కడైనా వాగులు వంకలు, నదులు, గట్లు తెగే ప్రమాదం ఉంటే ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తాత్కాలిక మరమ్మత్తులు ఏవైనా ఉంటే అందుబాటులో ఉన్న నిధుల మేరకు పనులు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట తాత్కాలికంగా రెస్టోరేషన్, డిసిల్టేషన్ పనులను చేపట్టాలని సూచించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కల్వర్టులు, బిడ్జిలు, రహదారులు ముందుగానే పరిశీలించి ఎక్కడైనా తెగిపోయే అవకాశం ఉంటే అక్కడ తగు చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీలలో లో లైన్ ఏరియాలో ఏవైనా ఉంటే.. అక్కడి డ్రైనేజీలలో నీరు బ్లాక్ అయ్యే ప్రదేశాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని డిఆర్‌ఓ కు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు... జిల్లా కేంద్రం పుట్టపర్తి కలెక్టరేట్ నందు 24/7 ప్రకారం పని చేసేలా 08555289039 నంబరు తో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్ కు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇన్చార్జి డిఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మోకా లో వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన



వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి బి నాగేంద్ర

**బళ్లారి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త)**

బళ్లారి గ్రామీణ క్షేత్రం పరిధిలోని మోకా గ్రామంలో ప్రముఖ కూడలిలో వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రూరల్ క్షేత్రం ఎమ్మెల్యే, మాజీమంత్రి బి నాగేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నో రోజులుగా మోకా ప్రజలు మోకా పట్టణంలో వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారని ప్రజల కల నేడు తీరిందని చెప్పారు. అధికంగా వాల్మీకి ప్రజలు మోకా లో నివసిస్తుండడం తో వారందరూ కోరుకున్న విధంగా మహా పురుషుడు వాల్మీకి విగ్రహాన్ని నిర్మించడం జరిగిందన్నారు. సర్వ మతాల ప్రజలు వాల్మీకి తత్వ సిద్ధాంతాల ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే నాగేంద్ర చెప్పారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. బళ్లారి తాలూకా కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు బీడీ హళ్లి సత్యనారాయణ రెడ్డి, బళ్లారి పాలికె కార్పొరేటర్ హనుమంత, గుమ్మనూరు జగన్, జోలదరాశి తిమ్మప్ప, నాగలకేరి గోవిందు, ఆసిఫ్, సోము, హగరి గోవిందు, వికె బసప్ప, నాగరాజు, మోకా గ్రామపంచాయతీ అధ్యక్షులు లక్ష్మీ వెంకటేష్, మాజీ అధ్యక్షుడు పత్తారు వెంకటేష్, రామాంజి తదితర నాయకులు పాల్గొన్నారు

## మసూద్ సోదరి నాయకత్వంలో మహిళా జైషే!

**ముజఫరాబాద్, అక్టోబరు 22:**

పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ తుఫత్ అల్ ముమినాత్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాస్‌లు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు 40 నిమిషాల పాటు మసూద్ సోదరీమణులు, కమాండర్ల కుటుంబ సభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి విరాళాలు కూడా సేకరిస్తున్నారు.

## 26 నుంచి ఉరగాద్రి బాలోత్సవం-2025 పోటీలు

**-పోస్టర్లను ఆవిష్కరించిన ఎంఈవో, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధులు**



ఉరగాద్రి బాలోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

జాతీయ బాలలదినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీయడంలో భాగంగా నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వతేదీనుండి నవంబర్ 9వతేదీవరకు ఉరగాద్రి బాలోత్సవం-2025 పోటీలు జరుగుతాయని నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ తెలిపారు. పట్టణంలోని స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం ఉరగాద్రి బాలోత్సవం-2025 పోటీల పోస్టర్లను మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప, ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రేణుమాకులపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సాకే భాస ్కర్, నిస్వార్థ సభ్యులు శ్రీవాణి, రాజేష్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, తిరుపతయ్య, ఎర్రిస్వామి, రఘు తదితరులతో కలిసి విడుదల చేశారు. విద్యార్థులకు ఎల్1 జూనియర్స్ విభాగంలో 4,5,6 తరగతులు, ఎల్2 సీనియర్స్ విభాగంలో 7,8,9 తరగతుల విద్యార్థులకు కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయన్నారు. 26న ఆదివారం ఉదయం 10 గంటలకు స్కిప్పింగ్, పేపర్‌పై రంగోలి, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు జరుగుతాయన్నారు. నవంబర్ 2న ఆదివారం పబ్లిక్ స్పీకింగ్, బెస్ట్ ఫ్రం వేస్ట్, రన్నింగ్, షటిల్ (డబుల్) పోటీలు, 8న శనివారం క్యాట్ వాక్, రీల్స్/షార్ట్స్, బెస్ట్ స్టూడెంట్ అవార్డు పోటీలు, 9న ఆదివారం చెస్, సింగింగ్, డ్యాన్సింగ్, స్కిట్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు జిల్లాస్థాయికి ప్రోత్సహిస్తామన్నారు. నవంబర్ 14న బాలల దినోత్సవం రోజు పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించడం జరుగుతుందని వివరించారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఏ గ్రామంలోనూ బాల్య వివాహం జరగకూడదు

### ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ భచావో భేటీ పడావోపై ఎంఎస్‌కేలకు అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

గోరంట్ల అక్టోబర్ 22 ప్రభాతవార్త

గోరంట్ల పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిడిఓ కమలాబాయి మరియు సోమందేపల్లి ప్రాజెక్టు సిడిపివో డాక్టర్ శాంత లక్ష్మి ఆధ్వర్యంలో మండలం లోని అన్ని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు, ఈ సమావేశానికి గోరంట్ల మండలంలోని ఐసీడీఎస్ సూపర్వైజర్లు నాగరాణి, మంజుల, శంకరమ్మ మరియు మండలం లోని అన్ని సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు హాజరయ్యారు ,ఈ కార్యక్రమంలో సిడి పీఓ గా మాట్లాడుతూ భేటీ భచావో భేటీ పడావో కార్యక్రమం పై దృష్టి సారించాలని గోరంట్ల మండలంలోని ఏగ్రామంలో బాల్య వివాహాలు జరగకూడదని సూచించారు, దీని పై ప్రజలకు విస్తృతఅవగాహన కల్పించాలని కోరారు.ప్రతి శనివారం స్కూల్స్ కు వెళ్ళి కిశోర వికాసం పై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే అంగన్వాడి కేంద్రాలు తరచూ సందర్శించి పిల్లల పెరుగుదల పర్యవేక్షణను పరిశీలించాలని, ప్రీ స్కూల్ కార్యక్రమాలలో అంగన్వాడి కార్యకర్తలకు తగిన సహకారం అందించాలని కోరారు. ఎంపిడిఓ కమలాబాయి మాట్లాడుతూ మహిళా శిసుసంరక్షణ చాలా ముఖ్యమైనదన్నారు. ఎం ఎస్ కే లు అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం అందించే సరుకులు ఐసీడీఎస్ సేవలపై గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు, తరచూ అంగన్వాడి కేంద్రాలను సందర్శించాలని సూచించారు.

## ప్రమాదంలో గాయపడిన ఆవుకు చికిత్సలు

సోమందేపల్లి అక్టోబర్ 22 ప్రభాతవార్త



ఆవుకు శస్త్ర చికిత్సలు చేస్తున్న డాక్టర్

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ప్రమాదంలో గాయపడిన ఆవుకు హిందూపురం ప్రభుత్వ పశు వైద్యశాలలో 18 తేదీన ధర్మవరం నుంచి హిందూపురం వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ సర్వీసు బస్సు ఎన్టీఆర్ సర్కిల్లో రాగానే డ్రైవర్ అత్యంత నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్ల రెండు ఆవులను బస్సు బలంగా గుద్దడం వల్ల తీవ్రంగా గాయాలయ్యాయి . వీటిలో ఒక ఆవు రెండు రోజులు చికిత్సలతో కొద్దిగా కోలుకుంది, ఇంకొక ఆవుకు పూర్తిగాకాలు విరిగిపోవడంతో చికిత్సకు ఏమాత్రం వీళ్ళు లేకపోవడం వల్ల హిందూపురం ప్రభుత్వ పశువైద్యశాలలో శ్రీ సత్య సాయి జిల్లా ర్టి శుభదాస్ ,డిడి పెంచలయ్య,ట్టి తిప్పేస్వామి, ఆధ్వర్యంలో డాక్టర్ సుబ్బరాయు , డాక్టర్ కిశోర్, డాక్టర్ హేమలత, డాక్టర్ బాల ఈశ్వర్ రాజు సంయుక్తంగా 3గంటల పాటు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిస్త చేసి ప్రమాదంలో గాయపడిన కాలును తొలగించి ఆవు ప్రాణాలను కాపాడినారు. అందుకు గోసంరక్షణ కమిటీ సంతోషం వ్యక్తం చేశారు ఆవుకు మెరుగైన వైద్య సేవలు అందించిన ప్రతి ఒక్క డాక్టర్కు అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

రొళ్ల అక్టోబర్ 22 ప్రభాతవార్త:



మొక్కలను అధికారులకు అందజేస్తున్న చెన్నకేశవ

మండల పరిధిలోని మళ్లీనా మదుగు గ్రామానికి చెందిన చెన్నకేశవ బుధవారం తహసిల్దార్ కార్యాలయావరణంలో పలు రకాల మొక్కలను నాటడానికి తాహసిల్దార్ షేక్షావలి సమక్షంలో సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవ్ మాట్లాడుతూ.. మొక్కలు పెంచితే పర్యావరణాన్ని కాపాడవచ్చు ని, గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అధిక ఆదాయం, దిగుబడినిచ్చే మొక్కలు నాటించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ భాగ్యలక్ష్మి,ఆర్ఐ గిరియప్ప, వీఆర్వోలు,డీలర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆధార్ క్యాంపులు

రామగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మండలంలో గురువారంనుంచి మొబైల్ఆధార్‌కేంద్రాలుఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ గంగావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 5 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడుతాయన్నారు. 23, 24 తేదీల్లో పేరూరు, కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో, 25, 27న పేరూరులో ఎంజెపి బాలుర గురుకుల పాఠశాల, రామగిరిలో మోడల్ స్కూల్‌లో 28, 29 తేదీలలో రామగిరి కెజిబివి, నసనకోట జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 30న నసనకోట బాలికల గురుకుల పాఠశాలలో, పోలేపల్లి ఉన్నత పాఠశాలలో ఈ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ఓ

రామగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంఅండ్ హెచ్ఓ

మండలంలోని రామగిరి, పేరూరు లోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం డీఎం అండ్ హెచ్ఓ ఫైరోజ్ బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామగిరిలో రికార్డులను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. పేరూరులో కూడా రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు ఆసుపత్రికి వస్తున్న ఓపి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బంది ద్వారా ఆరాతీశారు. సిబ్బంది హాజరు శాతాన్ని ఫీల్డ్ హాజరు శాతాన్ని కూడా పరిశీలించారు.రోగులకు ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని, ఎవరైనా విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ ఆంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌టి విద్యుత్‌లైన్ కిందికి ఉండటంతో ప్రమాదాలు

**- డ్రైవర్‌కు షాక్ తగిలి ఆసుపత్రి పాలు**

అగళి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని హనుమనపల్లి గ్రామం పొలాల్లో ఎల్‌టి విద్యుత్‌లైన్ కిందికి వాలి ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయని, విద్యుత్‌లైన్ మార్చాలని ఎన్నిసార్లు సంబంధిత ఏడికి, లైన్‌మెన్‌లకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని, ఎంపిటిసి భర్త చంద్రప్ప అన్నారు. ఇటీవల విద్యుత్‌లైన్ తగిలి తమిళనాడుకు చెందిన ఓ డ్రైవర్‌కు షాక్ తగిలి తీవ్ర గాయాలై ఆసుపత్రిపాలయ్యారు. విద్యుత్ షాక్ సర్క్యూట్ ద్వారా ఇప్పటికే గ్రామంలో రెండుసార్లు కుక్కర్లు, టీవలు, వాషింగ్ మిషన్‌లు పాడయ్యాయని తెలిపారు. మొక్కజొన్నన కోత తమిషన్‌కు ఈ కరెంట్‌లైన్ తగలడం మూలంగా సదరు డ్రైవర్ షాక్‌కు గురైనట్లు తెలిపారు. సత్వరమే లైన్‌ను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఫోటోగ్రఫీ మరియు వీడియో గ్రఫి లో ఉచిత శిక్షణ..

### నవంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోండి.

కొత్తచెరువు అక్టోబర్ 22 ప్రభాతవార్త.

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో 31 రోజులు పాటు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు ఉచిత ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్. శాంతి ప్రియ ఓ ప్రకటన లో తెలిపారు 19 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు లోపు వయసు యువకులు అర్హులు వీరికి ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సదుపాయం కల్పించబడును. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్,నాలుగు ఫోటో లు చదువు కున్న సర్టిఫికెట్స్ జీరాక్స్ కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బ్రాహ్మణపల్లి పుట్టపర్తి.నవంబర్ 5,2025 ఇవ్వాలని కోరారు మరిన్ని వివరాలు కి. 9705091727 ఈ మొబైల్ నెంబర్ ను సంప్రదించండి.

## ఆ సచివాలయంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు



13వ సచివాలయం రెండవ ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

స్థానిక తిలక్‌నగర్‌లోని 13వ సచివాలయం రెండవ ఫ్లోర్‌లో నిర్వహిస్తుండడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. సచివాలయానికి వచ్చే ప్రజలు దాదాపు 20 మెట్లు ఎక్కి పైకి వెళ్లాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కడ కిందకు పడతామోనని భయం భయంగా లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైకాపాప్రభుత్వం నుండి ఆ ప్రాంతంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలు ఇబ్బందులుపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. దాదాపు 8వేలు అద్దె చెల్లిస్తూ రెండవ ఫ్లోర్‌లో నిర్వహించాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాన్ని మరో ప్రాంతానికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

## సీసీ, బీటీ రోడ్లకు రూ.14.20 కోట్ల నిధులు...

మడకశిర, అక్టోబర్ 22 ప్రభాతవార్త.

మడకశిర నియోజక వర్గంలో ఐదు మండలాలలో గాను ఆయా గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.14.20 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు బుధవారం పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. 5 మండలాల పరిధిలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.14.20 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గుడిబండ మండలానికి రూ.2.20 కోట్లు, అమరాపురం, రొళ్ళ, అగళి, మడకశిర మండలాలకు రూ.3 కోట్లు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు.

## వర్షాలు జోరు జాగ్రత్తలు పాటించండి

### మండలంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రొళ్ల అక్టోబర్ 22 ప్రభాతవార్త:



తాసిల్దార్ షేక్షావలి

మండల ప్రజలకు తాసిల్దార్ షేక్షావలి సూచనలు చేశారు.నేటి నుంచి రెండు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు చెప్పారు. సత్య సాయి జిల్లా కలెక్టర్ ,జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా పశువుల గొర్రెల మేకల కాపరులు, వ్యవసాయ పనులు చేసే రైతులు చెట్ల కింద,విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదకర ప్రదేశాలలో ఉండరాదన్నారు.వృద్ధులు గర్భవతులు బాలింతలు పూరీలు ఉండరాద ని సురక్షిత ప్రాంతాలలో ఉండాలన్నారు. అలాగే మండలంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 9553524253, 8088084102, 6281624165 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## ఉరుములు మెరుపుల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండండి తహసిల్దార్ లక్ష్మినరసింహం

అమరాపురం అక్టోబర్ 22 ప్రభాతవార్త



తహసిల్దార్ లక్ష్మినరసింహం దృశ్యం

మండలంలోని ప్రజలు నేటి నుండి మూడు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షములు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అమరాపురం తహసిల్దార్ లక్ష్మీనరసింహం పేర్కొన్నారు. సత్య సాయి జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజాజీవనమునకు , పాడి పశువులకు, పంటలకు ప్రకృతి సిద్ధమైన ప్రమాదాలు సంభవించవచ్చని భావించి పశువుల , గొర్రెల మేకల కాపరులు, వ్యవసాయ పనులు చేసే రైతులు రైతు కూలీలు చెట్ల కింద వద్ద విద్యుత్ స్తంభాల వద్ద లేదా ఇతర ప్రమాదకర ప్రదేశాల వద్ద ఉండరాదని సాయంకాలం సమయంలో వీలైనంత త్వరగా ఇండ్లకు చేరుకోవాలని అలాగే వృద్ధులు గర్భవతులు బాలింతలు పూరీలు ఉండరాదని సురక్షిత ప్రాంతాలలో ఉండాలని గ్రామస్థాయిలోనే ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా2 కోట్ల బీటీ రోడ్లు మంజూరు

అమరాపురం అక్టోబర్ 22 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గం శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు,మాజీ శాసన మండలి సభ్యులు గుండుమలతిప్పేస్వామి చొరవతో అమరాపురం మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ద్వారా బిటి రోడ్లు నిర్మాణమునకు గాను 2 కోట్లు నిధులు మంజూరైనట్లు అమరాపురం మండల సహకార సంఘం అధ్యక్షుడు ఎన్ గణేష్ తెలిపారు. హేమావతి అమరాపురం మెయిన్ రోడ్డు నుంచి చిత్రాలింగేశ్వర దేవాలయం వరకు( మద్దనకుంట సమీపం ), హేమావతి హొసహట్టి మెయిన్ రోడ్డు నుంచి కోర్రేవు కర్ణాటక బార్డర్ వరకు వయా (రంగనాథ స్వామి దేవాలయం) రోడ్లు మంజూరైనట్లు ఈ సందర్భంగా ఆయా గ్రామ ప్రజలు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు రోడ్లు మంజూరైనందుకు మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజుకి మరియు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

## ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి -కమీషనర్ జబ్బార్‌మియా

గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త



కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ పథకం మేరకు రెగ్యులరైజ్ చేసుకోవాలని కమీషనర్ జబ్బార్‌మియా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్పేస్‌కు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశం ఈ నెల 23 వరకు వుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వాడి వేడిగా సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి, సింగిల్ విండో అధ్యక్షులు, సర్పంచు తదితరులు

అగళి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

బుధవారం మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా ప్రారంభమైంది. ఎంపిపి రేణుకా కామరాజు అధ్యక్షతన సమావేశం మొదలవ్వగానే అల్లికెర సర్పంచు ముద్దరాజు, జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి మధ్య రసవత్తరంగా చర్చ జరిగింది. చేసిన వాటికి బిల్లులు ఇవ్వాలని ముద్దరాజు కోరగా ఇందుకు స్పందించిన జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి తక్షణమే చేసిన పనులకు 2021, 22, 23, 24లలో చేసినపనులకు బిల్లులు ఇప్పటికే తీసుకున్నారని వారుతెలిపారు. కొత్తగా చేసిన పనులకు త్వరలోనే బిల్లులు ఇస్తామన్నారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందని, కొత్తబోర్ల తవ్వకాలకు, మోటారు స్టార్టర్లకు డబ్బులు అవసరం అన్నారు. మేము గతంలో చేసిన పనులకు ఏడెనిమిది ఏళ్ల తర్వాత బిల్లులు తీసుకున్నట్లు అందుకు మేము లక్షల్లో వడ్డీలు చెల్లించినట్లు జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు సబ్మిట్ చేయాలని, వాటిని పరిశీలించి సత్వరమే బిల్లులు అందజేస్తామని ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. వీధిలైట్లు, డ్రైనేజీల ఏర్పాటు, వీధుల శుభ్రం నిధులను కేటాయించండని జడ్పిటిసి అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో సిమెంట్ రోడ్లు, చెరువు పనులు చేసిన వాటికి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించలేదన్నారు. మీరు చేసిన పనులకు బిల్లులు సబ్మిట్ చేస్తే అధికారులు బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. గత వైఎస్ఆర్ పార్టీలో చేసిన పనులకు కూటమి ప్రభుత్వంలో బిల్లులు అందించారని తెలిపారు. ఏఓనాగరాజు మాట్లాడుతూ.. రూ.3.90 కోట్లు అన్నదాత సుఖీభవ రైతులకు చెల్లించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖపనిముట్లు, డ్రిప్‌పరికరాలకుట్రాక్టర్లకు, ఎరువులు, మందులపై 12.5శాతం జిఎస్‌టి ఉంటే 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. కిసాన్, డ్రోన్ 10లక్షలుకాగా 80శాతంసబ్సిడితో 7,84000 లకు కెంచుయాదవ్‌కు మంజూరు చేసినట్లు తెలిపారు.హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు మండలంలో 2,800 ఇళ్లకు దరఖాస్తు వచ్చాయని, అర్హులైన వారు ఇంకా దరఖసాఉ్త చేసుకోవచ్చున్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ.. రామనపల్లి, ఇనగలూరు, హెచ్‌డి హల్లి, వడగుంటనహల్లి గ్రామాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కె.గొల్లహట్టి, జిజిహల్లి గ్రామాల్లో మినీ అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొత్త అంగన్వాడీ భవనాలకు ఉపాధి హామీ పథకం కింద 12 లక్షలతో నిర్మిస్తామని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ శాఖ నుంచి పిఎం మాతృ వందన యోజన పథకం కింద గర్భిణీలు దరఖాస్తు చేసుకోవాలని, వారికి 6వేల ప్రకారం పిఎం మాతృయోజన కింద వస్తాయన్నారు. తహశీల్దారు సుబ్బారావు మాట్లాడుతూ.. మండలంలో 10,470 రేషన్‌కార్డులను పంపిణీ చేశామని, 1,436 మందికి పొజిషన్ సర్టిఫికెట్ల ఇచ్చామని, 4744 మందికి క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిపారు. 2 లక్షల ఖాతాల్లో ఉన్న భూములకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తామన్నారు. 32 గ్రామాల్లో స్మశాన వాటికలకు పొజిషన్ సర్టిఫికెట్లను ఇచ్చినట్లు తెలిపారు. ఎంఈఓ కృష్ణమూర్తి రాజు మాట్లాడుతూ.. 164 మందికి తల్లికి వందనం రాలేదని, సచివాలయాల్లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసుకోవచ్చున్నారు. హార్టికల్చర్ అధికారి లక్ష్మానాయక్ మఆట్లాడుతూ.. 76 ఎకరాల్లో మల్బరీ సాగుకు అవకాశం కల్పిస్తామని, ఒక్కొ రైతు ఐదు ఎకరాల్లో మల్బరీ సాగు చేసుకోవచ్చని, మొక్కలు నాటుకోవడానికి ఎకరాకు 22,500 అందిస్తామని తెలిపారు. జడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ వచ్చినందుకు సభలో హర్షం వ్యక్తం చేశారు. సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ.. తాము అధికారం చేపట్టి మూడు నెలలకే 1.27 కోట్లు రుణాలు అందించామని, రాబోయే రోజుల్లో ఆవులు, గేదెలకు తక్కువ వడ్డీతో తక్షణమే రెండు కోట్ల రూపాయలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి, డాక్టర్ శివానంద, ఎంఈఓ కృష్ణమూర్తిరాజు, ఏఓ నాగరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్, ఏపిఓ మంజునాథ్, కార్యదర్శిలు హాజరయ్యారు. సమావేశం వాడీ వేడిగా జరుగుతుండగానే సర్పంచులు తమకు బిల్లులు ఇవ్వలేదని, సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

## నవంబరు 8,9తేదీలలో తెలుగురాష్ట్రాల ఓపెన్ చదరంగం పోటీలు

దర్మవరంటౌన్, అక్టోబరు 22 ప్రభాతవార్త



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యువర్స్ పౌండేషన్, టోర్నీ నిర్వహకులు

ధర్మవరంకు చెందిన యువర్స్ పౌండేషన్, అనంతపురంకు చెందిన హైబ్రోచెస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 8,9 తేదీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఓపెన్ చదరంగం పోటీలను నిర్వహించనున్నట్టు టోర్నిమెంట్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఉషోదయం స్కూల్లో చెస్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. .ఈ టోర్నీ స్థానిక ఉషోదయ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. టోర్నీలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.8వేలు, ద్వితీయబహుమతి రూ.6వేలు, తృతియ బహుమతి రూ.4వేలు, నాల్గవ బహుమతి రూ.3వేలు, ఐదవ బహుమతి రూ.2వేలుతో పాటు మరిన్ని బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కావున చెస్ క్రీడపై ఆశక్తి ఉన్న వారు 8వతేదీ ఉదయం 8గంటలలోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నీ హానరబుల్ ప్రసిడెంట్ డాక్టర్ బీవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ చాంద్ బాషా ఆర్గనైజింగ్ సెక్రటరీ కెఎస్ జాకీర్ హుస్సేన్, యువర్స్ పౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర,కార్యదర్శి జయరాం, వ్యవస్థాపక అధ్యక్షులు పోలా ప్రబాకర్, కోశాదికారి వంకదారి మోహన్, సభ్యులు కేతాలోకేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఈనెల 26న ఆదివారం స్థానిక ఉషోదయ స్కూల్లో ఉచిత మెగా వైద్యశిబిరాన్నికూడా నిర్వహించడం జరుగుతుందని, కావున ధర్మవరం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వైసిపి యువజన విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శి నితిన్ రెడ్డి.

మడకశిర టౌన్ అక్టోబర్ 22 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట యువ జన విభాగం కార్యదర్శి నితిన్ రెడ్డి

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నితిన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించి నందుకు జగన్ మోహన్ రెడ్డి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నన్ను నమ్మి రాష్ట్ర స్థాయి బాధ్యత అప్పగించిన మా అధినేత జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, జగన్ మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా యువతను ముందుకు తీసుకువెళ్తానని తెలిపారు.

## అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట ప్రధాన కార్యదర్శిగా న్యాయ వాదీ గుండుమల రాధాకృష్ణ నియామకం.

మడకశిర టౌన్ అక్టోబర్ 22 ప్రభాతవార్త.



న్యాయవాది రాధాకృష్ణను అఖిల భారత యాదవ సభకు ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప

మడకశిర పట్టణంలోని సాయి నగర్ న్యాయవాది గుండుమల రాధాకృష్ణ స్వగృహంలో యాదవ సభ అధ్యక్షులు లక్ష్మీనరసప్ప న్యాయవాది రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సభకు ఆహ్వానించారు.ఈ నెల 19 వ తేదీన కాకినాడలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికచేసి నందువల్ల నియామక ఉత్తర్వులను సత్య సాయి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షులు లక్ష్మీనరసప్ప అందచేసారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించి నందుకు రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, ఉమ్మడి జిల్లా యాదవ నాయకులకు న్యాయవాది గుండుమల రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మండలంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యం

**- శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణుడు**

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్, 22 ప్రభాతవార్త



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకృష్ణుడు



ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ కార్యక్రమానికి హాజరైన వాలంటీర్ టీచర్స్

చెన్నె కొత్తపల్లి మండలంలో వాలంటీర్ సహకారంతో మండలంలోని వయోజనులందరినీ సంపూర్ణ అక్షరాసులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంపీడీవో బాలకృష్ణుడు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలోని రంద్రమదేవి, మండల మహిళా సమాఖ్య భవనంలో ఉల్లాస్ అక్షరఆంధ్ర కార్యక్రమంలో వాలంటీర్ టీచర్స్‌కు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలకృష్ణుడు మాట్లాడుతూ..2029 సంవత్సరంలోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "ఉల్లాస్ అక్షర ఆంధ్ర " కార్యక్రమం చేపట్టడం జరిగిందని, చెన్నేకొత్తపల్లి మండలానికి మొదటి దశలో 1900 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించడమైనది, కావున వయోజన విద్య, డిఆర్‌డిఎ, ఎన్ఆర్ఇజిఎస్ శాఖల ఆధ్వర్యంలో 15-60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వయోజనులు1600 మంది పొదుపు సంఘాల మహిళలను,300 మంది ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు పురుషులను అభ్యాసకులుగా గుర్తించి వారికి ప్రతి పదిమందికి ఒక వాలంటీర్ టీచర్‌తో సాయంత్రంపూట చదువు చెప్పించడం జరుగుతుందన్నారు. 22 అక్టోబర్ 2025 నుండి, 2026 సంవత్సరం, మార్చి 31వరకు అక్షర కేంద్రాలలో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు అభ్యాసకులకు ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి బోధించడం జరుగుతుందని, మార్చిలో అభ్యాసకులకు ఎన్ఐఓఎస్ ద్వారా పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. మండల విద్యాశాఖ అధికారి ప్రసన్నకుమార్ నాయుడు మాట్లాడుతూ..చదువుకున్న యువత సేవాభావంతో వాలంటీర్లుగా ముందుకువచ్చి చెన్నేకొత్తపల్లి మండలంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు కృషిచేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసన్న కుమార్ నాయుడు, వయోజనవిద్య పర్యవేక్షకులు వెంకటరమణ, ఏపిఎం నాగేంద్ర, ఏపిఓ జయమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, సిసిలు, అకౌంటెంట్‌లు, అనిమేటర్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్స్, అక్షర ఆంధ్ర వాలంటీర్ లు తదితరులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 22-10-2025 PM 10:42 Page 1



## ఎపికి గూగుల్ డేటా సెంటర్ రావడం ఒక వరం

- అది చంద్రబాబు, లోకేష్ వల్లే సాధ్యమైంది
- 1.36లక్షల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఆంధ్రప్రదేశ్‌కు రావడం గర్వకారణం

**అగళి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

అమెరికా తర్వాత ఇంత పెద్ద గూగుల్ డేటా సెంటర్ భారతదేశంలోని అది ఆంధ్రప్రదేశ్‌కు రావడం, అందులోనూ విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ డేటాసెంటర్ రావడం గర్వకారణమని, తెలుగుదేశం, జనసేన, బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. అమెరికా, ఇండియా ప్రస్తుతం పన్నుల రూపంలో విబేదాలు ఉన్నాయి. అమెరిగా అధ్యక్షులు ట్రంప్ మన దేశ వస్తువులకు విపరీతంగా పన్నులు పెంచడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాకు చెందిన గూగుల్ డేటా సెఎంటర్ ప్రపంచంలోనే మొదటిది అమెరికాలో ఉండగా, రెండోది విశాఖపట్నంకు రావడం, అది ఒప్పందం కుదుర్చు కోవడం, దానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ కృషి చాలా మెండుగా ఉందన్నారు. 1.36లక్షల కోట్ల పెట్టుబడితో దాదాపు 1.90 లక్షల ఉద్యోగాలు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నాయి. వ్యవసాయం, వైద్యం సాంకేతికంగా ఈ డేటా సెంటర్ రావడం వల్ల ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతుంది. హైదరాబాద్‌లో హై టెక్ సిటీని చంద్రబాబు ఎలా ప్రారంభించి అభివృద్ధి చేశారో అది అబివృద్ధి చెందడానికి దాదాపు 10-15 ఏళ్లు పట్టింది. గూగుల్ సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అభివృద్ధి చెందడానికి ఎంతో సమయం పట్టదని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తలమాణికంగా మారుతుందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విజనరి ఉన్న చంద్రబాబునాయుడు ముందు చూపుతో దాదాపు సంవత్సర కాలంగా పాటుపడి గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నం రావడానికి విశేషంగా కృషి చేశారని, చంద్రబాబు నాయుడుకి, నారాలోకేష్‌కు తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు వారి కృషిని అభినందించడంతోపాటు కృతజ్ఞతలు తెలియజేశారు. జజడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, కన్వీనర్ తిప్పేస్వామి, మాజీ ఎంపి బసవరాజు, మాజీ సర్పంచు శివలింగప్ప, తెలుగుదేశం నాయకులు, మాజీ ప్రధాన కార్యదర్శి రాజన్న, కరియన్న, బసవరాజు, గ్యాస్ కరియన్న తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## విజయవంతంగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

**ధర్మవరం రూరల్ అక్టోబర్22 ప్రభాతవార్త**




అభివృద్ధిపై విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయి మనోహర్

ధర్మవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మన గ్రామాలు, మన బాధ్యతలు, మన విధులు అనే థీమ్ పై విస్తృత స్థాయి చర్చ నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డిడిఓలు, ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు, పిడిఓలు పాల్గొని మండలంలోని వివిధ అభివృద్ధి, సామాజిక, విద్యా మరియు సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత చర్చలు జరిపారు. ధర్మవరం మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా మార్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. రైతుల సమస్యలు, పంట కోతలు మరియు వ్యవసాయ మద్దతు అంశాలపై చర్చించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం అమలుపై కూడా సమగ్ర చర్చ జరిగింది. నష ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలను అక్టోబర్ చివరి వారం నుండి నవంబర్ మొదటి వారం వరకు ఎస్‌ఒపి ప్రకారం నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ అంశాలపై వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల నుండి సూచనలు, అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ కూడా స్వీకరించారు. తద్వారా భవిష్యత్తులో పథకాల అమలు మరింత సమర్థవంతంగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మండల అభివృద్ధి అధికారి అధికారులను ఉద్దేశించి, వచ్చే 3 4 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అందరం కలసి పని చేయాలని సూచించారు.

## ధర్మవరం సినిమా అన్ని వర్గాల ప్రజలకు నచ్చేలా ఉంటుంది

**ధర్మవరం టౌన్ అక్టోబర్ 22 ప్రభాతవార్త**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మవరం సినిమా యూనిట్

ధర్మవరం సినిమా అన్ని వర్గాల ప్రజలకు నచ్చే విధంగా ఉంటుందని ధర్మవరంసినిమా డైరెక్టర్ తెలిపారు. బుధవారం స్థానిక బొగ్గరపు వెంకటరమణ ఫంక్షన్ హాల్ లో ధర్మవరం సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాన్ని సినిమా డైరెక్టర్ రాజా వెంకట్, నిర్మాతలు చింతపులుసు పెద్దన్న, వెంకట్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం సినిమాను ఎన్నో కష్టాలు పడి నాలుగు సంవత్సరాల పాటు నిర్మించడం జరిగిందని. ఈ సినిమా ద్వారా చేనేత కార్మికుల కష్టాలు అందరికీ తెలుస్తాయి అన్నారు. ఈనెల 24న దేశవ్యాప్తంగా ధర్మవరం సినిమాను విడుదల చేస్తున్నామని ప్రత్యేకించి ధర్మవరం రంగా థియేటర్లో ఈనెల 24న ధర్మవరం సినిమాను ప్రతి ఒక్కరు చూసి మమ్మల్ని మరింత ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత ఉదయగిరి బాబు, పలువురు సినిమా టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు

## బిల్లులు చెల్లించాలని సర్పంచులు ఎంపిడిఓ కార్యాలయం ముందు నిరసన

- అక్కడే భోజనం తిన్న వైనం

**అగళి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



నిరసనలోనే భోజనం తింటున్న సర్పంచులు

మండలంలో చేసిన పనులకు సత్వరమే బిల్లులు చెల్లించాలని ఎంపిడిఓ కార్యాలయం ముందు సర్పంచులు నిరసన వ్యక్తం చేయడంతోపాటు అక్కడే భోజనం తిన్నారు. తమకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశ్యారు. ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ చేసిన పనుల బిల్లులు సబ్మిట్ చేయాలని తెలిపారు. కొత్తగా చేసిన పనులకు సత్వరమే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను పాత సమయంలోనే నిర్వహించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం.హరూన్ రషీద్

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం.హరూన్ రషీద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలను పాత సమయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎం.హరూన్ రషీద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ కళాశాల సమయాలు మార్చడం చేత గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సరైన బస్సు సౌకర్యంలేక కళాశాలకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని పీడీలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారన్నారు. క్రీడలపట్ల ఆసక్తి కల్గిన విద్యార్థులు పీడీలు లేకపోవడంతో సరైన శిక్షణ పొందలేక క్రీడాకారులుగా రాణించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన కోరారు.

## టిడిపి కార్యకర్త భార్య మృతి

ఆర్థిక సాయం అందజేసిన టిడిపి నేత నిమ్మల శ్రీధర్

**గోరంట్ల అక్టోబర్ 22 ప్రభాత వార్త**



పార్టీ దేహానికి నివాళులు అర్పిస్తున్న కన్వీనర్.

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో రాజీవ్ కాలనీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త శ్రీనివాసులు భార్య నందిని అనారోగ్య కారణాల వలన మరణించారు, ఈవిషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వారి ఇంటికి వెళ్ళి పూలమాలలు వేసి, వారి కుటుంబాన్ని వరామర్శించారు. గోరంట్ల టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి మరియు పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు సవితమ్మ ఆదేశాల మేరకు నందిని అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసిన టీడీపీ మండల నాయకులు నిమ్మల శ్రీధర్. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్, మాజీ వార్డ్ మెంబెర్ పసుపులేటి శ్రీనివాసులు, గంగంపల్లి సుబహాన్, ప్రతాప్ నాయుడు, బూత్ కో కన్వీనర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నిమ్మల శ్రీధర్

## విద్యుత్ వినియోగదారుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలి

- జిల్లా విద్యుత్ అధికారి సంపత్ కుమార్



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యుత్ అధికారి

**మడకశిర అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

స్థానిక యాదవ కళ్యాణ మంటపం నందు బుధవారం సత్యసాయి జిల్లా సూపరెంటెండింగ్ ఇంజనీర్ సంపత్ కుమార్, మడకశిర మరియు పెనుగొండ సబ్ డివిజన్స్ పరిధిలోని అన్ని మండలాల విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశంను నిర్వహించారు. సమావేశంలో సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి విద్యుత్ సమస్యలను ఏప్పటికప్పుడు పరిష్కరించాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని మరియు సంస్థకి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి హిందూపూర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ పుట్టపర్తి రామస్వామి, పెనుగొండ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ శేషగిరి బాబు, యం.రఘు మరియు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, హిందూపూర్ మరియు అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 9వ రోజుకు చేరిన సామూహిక రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న సిపిఐ నాయకులు

**గుంతకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సామూహిక రిలే నిరాహార దీక్షలు బుధవారం 9వ రోజుకు చేరాయి. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న కసాపురం బ్రిడ్జి, బళ్లారి గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. 9వ రోజు దీక్షలో నాయకులు దాసరి శ్రీనివాసులు, కత్తి శీన, ఆంజనేయులు, రమేష్, కృష్ణ, శ్రీనివాసులు, విజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సాకే గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాముదాయల్, నాయకులు దేవేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు బూదగవి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

-అభినందించిన ప్రధానోపాధ్యాయులు కె.విజయభాస్కర్‌రెడ్డి



రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మండల పరిధిలోని బూదగవి గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సి.వినయ్ (10వ తరగతి), నిహారిక (9వ తరగతి), రమాదేవి (10వ తరగతి), అంజుమ్ (10వ తరగతి) రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 4వ తేదీన జిల్లా కేంద్రం అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరు ఈనెల 24, 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గ్రామానికి చెందిన బి.నాగేంద్ర అనే వ్యక్తి క్రీడా పరికరాల కోసం పాఠశాలకు 5,000 రూపాయలు విరాళం అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అగళి మండలానికి రూ.3 కోట్లు మంజూరు

- మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన కన్వీనర్, జడ్పిటిసి

**అగళి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

అగళి మండలానికి వివిధ అభివృద్ధి పనులకు గాను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల కృషి వల్ల రూ.3కోట్లు మంజూరు అయినట్లు కన్వీనర్ తిప్పేస్వామి, జడ్పిటిసి ఉమేష్, మాజీ ఎంపిపి బవసరాజు, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. కరిదాసనపల్లి టు మదురేపల్లి మెయిన్‌రోడ్డు, రావుడి ఆంజినేయస్వామి బిటి రోడ్డుకు 1.50 కోట్లు మంజూరు చేయించారు. రామనపల్లి టు ఆంజినేయస్వామి టెంపుల్ బిటి రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు, అగళి బిసి హాస్టల్ కాంపౌండ్ నిర్మాణానికి రూ.20 లక్షలు, మధూడి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి 20 లక్షలు మంజూరు చేయించారు. అగళి మండలానికి వివిధ అభివృద్ధి మండలానికి గాను రూ.3 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామికి, మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

**రామగిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రామగిరి పోలీసులకు లభించిన సమాచార ప్రకారం, రామగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ జి.సుధాకర్ యాదవ్ పేరుతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ (ఫేక్) ఫేస్‌బుక్ అకౌంట్ సృష్టించినట్లు తెలిసింది. ఆ నకిలీ ఖాతా ద్వారా ప్రజలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపించడం, అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రామగిరి పోలీసులు తెలియజేశారు. ఆ ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాతో జి.సుధాకర్ యాదవ్‌కి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఆ ఖాతా నుండి వచ్చే ఎటువంటి సందేశాలను నమ్మవద్దు, స్పందించవద్దు. ఆ అకౌంట్‌ను చూడగానే రిపోర్ట్-ప్రిటెండింగ్ టు బి సంవన్ ద్వారా ఫేస్‌బుక్‌లో రిపోర్ట్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా డబ్బు సంబంధిత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దు అన్నారు. పోలీసు అధికారుల పేరుతో నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు సృష్టించడం, ప్రజలను తప్పుదారి పట్టించడం తీవ్ర నేరం అని హెచ్చరించారు. ఈ చర్యపై సైబర్ నేరాల చట్టం (ఐటి యాక్ట్ 66 సి, 66డి), ఐపిసి 419, 500 సెక్షన్ల క్రింద కఠిన చర్యలు తీసుకోబడునన్నారు. సంబంధిత వ్యక్తులను గుర్తించే దిశగా సైబర్ క్రైమ్ విభాగం ద్వారా విచారణ ప్రారంభించబడిందని, ప్రజలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని, ధృవీకరించని అకౌంట్లను నమ్మరాదని రామగిరి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు

**గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**




నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో బుధవారం పెన్షనర్ల కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు కొమరం భీమ్ 124వ జయంతి, ప్రముఖ కవి అస్ఫాఖుల్లాఖాన్ 125 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యమంలో భీమ్ చేసిన పోరాటాల గురించి వివరించారు. ఖాన్ చేసిన స్వాతంత్ర పోరాటం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుళ్లాయిబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేష్, షెక్షావలి, విజయలక్ష్మి, గోవిందప్ప, దేవదాస్, అహ్మద్, నారాయణశెట్టి, చెన్నారెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆమిద్యాలలో నవంబర్ 1న వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

-హాజరు కానున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**




ఆమిద్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయం

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో నవంబర్ 1వ తేదీన స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం కార్తీక శుద్ధ ఏకాదశి శనివారం ఉదయం 11 గంటలకు వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని కార్యక్రమంలో ముఖ్య, విశిష్ట అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంఎల్‌సీ వై.శివరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆర్టీసీ రీజినల్ ఛైర్మెన్ పూల నాగరాజు హాజరవుతారన్నారు. నవంబర్ 1న శనివారం ఉదయం సుప్రభాతం, గంగపూజ, గోపూజ, గణపతి పూజ, రక్షాబంధనం, గణపతి, నవగ్రహ వాస్తు పూజలు, రామ యజ్ఞం, 11 గంటల నుండి యంత్రి ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, కుష్మాండబలి, మహా మంగళహారతి కార్యక్రమాలు వేద పండితులు చంద్రమౌళిస్వామి ఆధ్వర్యంలో జరుగుతాయని వివరించారు.

## రిక్వెస్ట్ బస్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

**గుంతకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ఆర్టీసి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి రోడ్డులోని బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం బస్సులు అక్కడ ఆపకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు స్పందించి ప్రయాణికులు అడిగిన వెంటనే బస్సులు అక్కడ ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జగదీష్, జిన్నే మస్తాన్, సాకే నాగరాజు, వెంకీ ఉన్నారు.

## ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సన్మానం

-గ్రామ పంచాయతీల రికాటగరైజేషన్, పంచాయతీ కార్యదర్శుల పేరు మార్పు నిర్ణయంపై కృతజ్ఞతలు



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఏవో, పంచాయతీ కార్యదర్శులు

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను బుధవారం హావళిగి గ్రామంలో విడపనకల్లు ఎంపీడీవో సత్యబాబు, మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలను రికాటగరైజేషన్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులకు త్వరితగతిన పదోన్నతులు కల్పించడమే కాకుండా పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ అభివృద్ధి అధికారిగా మారుస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై వారు మంత్రికు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సోమయ్య, నాగభూషణం, అబ్దుల్ మునాఫ్, మహేష్, లోకేష్, నాగరాజు, రవికుమార్, రహిమాన్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం

-నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి డి.తిప్పేనాయక్

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ఈనెల 23వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమావేశంలో ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణ విషయమై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## జీఎస్టీ ఆదాయంపై ఇంటింటి ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు.....



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు.

**గోరంట్ల అక్టోబర్ 22 ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకై గోరంట్ల మండలంలోని కోరేవాండ్లపల్లి గ్రామంలో బుధవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి నేతృతంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరితోపాటు గౌని వారి పల్లి సింగిల్ విండో అధ్యక్షులు రవి మోహన్, మలసముద్రం పంచాయతీ సర్పంచు సువర్ణ అశ్వత్ రెడ్డి, నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచ్ నరేష్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, కమలాకర్ రెడ్డి, లక్ష్మీనరుసు, నరేంద్ర రాయల్, పసుపులేటి శ్రీనివాసులు తదితరులు గ్రామ వీధుల్లో తిరుగుతూ కరపత్రాలు పంచుతూ తగ్గిన జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశ పెడుతున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని తద్వారా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మండల కన్వీనర్ బాల కృష్ణ చౌదరి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## గుడిబండలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



చెరువును పరిశీలిస్తున్న తహశీల్దారు

**గుడిబండ అక్టోబర్ 22 ప్రభాతవార్త**

మండల తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిందని వచ్చే మూడు రోజులపాటు భారీ వర్షాలు ఉంటున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 9640730634కు సమాచారం అందించాలని మండల ప్రజలను కోరారు. అలాగే వర్షాల కారణంగా మండలంలోని మోరుబాగలు చెరువును సందర్శించి చెరువు స్థితిగతులపై ఆరాతీశారు. తహశీల్దారు వెంట విఆర్‌ఓలు త్యాగరాజుస్వామి, రామప్ప తదితర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్లో ఘనంగా ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలు

**కనగానపల్లి అక్టోబర్ 22 ప్రభాతవార్త**



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ నందు బుధవారం ఎస్ ఆర్ శంకరన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ డి. వెంకటేష్ మాట్లాడుతూ ఎస్ ఆర్ శంకరన్ నెల్లూరు జిల్లా కలెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి గా ముఖ్య కార్యదర్శి గాను అలాగే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ హాస్టల్స్ అభివృద్ధి కోసం నిర్విరామంగా పనిచేశారని ఆయన సేవలను హాస్టల్ వార్డెన్ డి. వెంకటేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది కూర్మ రామాంజనేయులు, నాగలక్ష్మి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

